క్లుప్తంగా

పూనా ప్యాక్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): స్థానిక ఎన్ఆర్ పేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో 1932 సెప్టెంబర్ 24 పూనా ప్యాక్‌పై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ పూనా ప్యాక్ కోసం అంబేడ్కర్ చేసిన కృషి, వాటి పరిణామాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కొరబండి బాబూరావు, ప్రసాద్, జి.నాగేశ్వరరావు, చింతయ్య పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా బధిరుల, సంజ్ఞా భాషా దినోత్సవం



టచ్‌ఫోన్‌ను అందజేస్తున్న తహసీల్దార్

ఏలూరు (టూటౌన్): ప్రపంచ బధిరుల, సంజ్ఞా భాషా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్ నందు ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రేమాభిమానాలు చూపించాలన్నారు. ముగ్గురు బధిర దివ్యాంగులకు టచ్‌ఫోన్‌లను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జీసీహెచ్ ప్రభాకర్, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్, డీసీపీవో సూర్యచక్రవేణి, ఏపీ స్పోర్ట్స్ ఫెడరేషన్‌కు చెందిన సీహెచ్ తాతారావు, ఉద్యోగుల విభాగం అధ్యక్షురాలు లావణ్య, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బధిరుల సంఘం అధ్యక్షుడు టి.రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక నరసింహారావు పేటలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ ఏలూరు నగర కార్యదర్శి వి.సాయిబాబు, బి.జగన్నాధరావు పాల్గొన్నారు.

కాలనీ రోడ్లకు మహర్దశ



కోటేశ్వరదుర్గాపురంలో నిర్మించిన సీసీ రోడ్డు



ప్రత్తికోళ్లలంకలో చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్డు పనులు

- కోట్లాది రూపాయలతో నిర్మాణం
- చురుగ్గా సాగుతున్న పనులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో కాలనీ రోడ్ల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందు కోసం అధికారులు మండల పరిషత్, రూర్బన్, ఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో మొదట ప్రాధాన్యత పేదల నివసించే ఎస్సీ, బీసీ కాలనీలకు ఇస్తున్నారు. తర్వాత ప్రధాన గ్రామంలో రోడ్లు అభివృద్ధి పర్చేందుకు ప్రణాళిక రూపొందించారు.

పనులు ఇలా..

ఇప్పటికే అనేక గ్రామాల్లో కాంట్రాక్టర్లు పనులు కొనసాగిస్తున్నారు. పెద్ద ఎత్తున గ్రావెల్, క్రషర్‌డస్ట్‌తో పాటు సిమెంట్, చిప్స్ తరలిస్తున్నారు. గ్రావెల్ రోడ్డు 8 అంగుళాలు ఎత్తు పోస్తున్నారు. దీన్ని రోలింగ్ చేయడం వల్ల 6 అంగుళాలకు దిగుతోంది. ఇదే క్రమంలో సీసీ రోడ్లు వేసే ముందు 8 అంగుళాలు ఎత్తుకు వెట్ మిక్సర్, డస్ట్ పోస్తున్నారు. దానిపై చిప్స్, సిమెంట్‌తో కూడిన మిక్సర్ 7 అంగుళాలు ఎత్తు పోస్తున్నారు. ఫలితంగా నిన్నటి వరకూ మట్టి రోడ్లతో బురదమయమైన కాలనీరోడ్లు గ్రావెల్ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. గ్రావెల్ రోడ్లు సీసీ రోడ్లుగా మారుతున్నాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు రోడ్ల పనులు ముమ్మరంగా చేపట్టామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు చెప్పారు.

రూ.4 కోట్ల పనులు ప్రారంభం

కొద్దివారాల క్రితం ప్రభుత్వం రూ.4 కోట్ల రూర్బన్ నిధులతో సీసీ రోడ్లు అభివృద్ధి ప్రారంభించింది. ఇందులో ప్రత్తికోళ్లలంకకు రూ.22.12 లక్షలు, పైడిచింతపాడుకు రూ.17.99 లక్షలు, కోటేశ్వరదుర్గాపురానికి రూ.55.44 లక్షలు, గుడివాకలంకకు రూ.31.22 లక్షలు, మొండికోడుకు రూ.32.73 లక్షలు, చాటపర్రుకు రూ.75.04 లక్షలు, జాలిపూడిలో రూ.34.23 లక్షలు, మాదేపల్లిలో రూ.44.80 లక్షలు, మల్కాపురంలో రూ.33.25 లక్షలు, శ్రీపర్రుకు రూ.53.18 లక్షలు కేటాయించింది.. ఇప్పటికే మండల పరిషత్ నిధులతో మాధవపురంలో రూ.8 లక్షలతో గ్రావెల్ రోడ్డు పోశారు. గుడివాకలంక ఎస్సీకాలనీలో మట్టి రోడ్లు అన్నీ గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. కోటేశ్వరదుర్గాపురంలో ప్రస్తుతం 900 మీటర్ల సీసీ రోడ్ల పనులు సాగుతున్నాయి. ఇదే క్రమంలో మరిన్ని గ్రామాల్లో పనులు చేపట్టనున్నామని పీఆర్ ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. కొక్కిరాయిలంక కాలనీరోడ్లు అన్నీ గ్రావెల్ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. కొద్దిరోజులుగా ప్రత్తికోళ్లలంక జడ్పీ పాఠశాల రోడ్లు, ఎస్సీ కాలనీ సీసీ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయమని సంస్థ ఏలూరు అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ నెలవారీ సమీక్షను స్థానిక జిల్లా పరిషత్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ కార్యాలయం నందు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న సంస్థ మానవత అని గుర్తు చేశారు. అనంతరం సీఆర్ఆర్ కాలేజీలో బీటెక్ చదువుతున్న సంపత్‌కు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. బ్రెయిన్ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం చేశారు. విశిష్ట సేవలందిస్తున్న యూటీఎఫ్ మహిళా కన్వీనర్ ఓరుగంటి కనకదుర్గ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన ఆనంద నాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవినేని భాస్కరరావు, దేవరపు రత్నాకరరావు, అడుసుమిల్లి నిర్మల, వాసిరెడ్డి శేషగిరిరావు, కడియాల కృష్ణారావు, మోహిని, వెంకటరత్నం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.30,870, విరాళాలు రూ. 8,253, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.20,625, ఫొటో విక్రయంతో రూ.1,860, మొత్తం రూ.61,608 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి బాపట్లలో బీకేఎంయూ రాష్ట్ర మహాసభలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) 22వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25వ తేదీ నుండి మూడు రోజుల పాటు బాపట్లలో జరుగుతున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు మహాసభల వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 26, 27 తేదీల్లో జరిగే ప్రతినిధుల సభకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి 50 మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వద్దు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ, అలసత్వం ప్రదర్శించకుండా ఎటువంటి అనారోగ్యం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించాలని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు సూచించారు. క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలోని మునగా రామ్మోహనరావు వేదికపై నిర్వహించిన వైద్య అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో 153 మందికి బీఎండీ స్కాన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అక్కినేని వెంకటేశ్వరరావు, బి.రత్నకుమార్, బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్నా వెంకటరామయ్య, వనిమిశెట్టి రామారావు పాల్గొన్నారు.

తుది దశకు గణపతి నవరాత్రి ఉత్సవాలు



ఏలూరులో నిమజ్జనం కోసం ఊరేగింపుగా స్వామివారిని తరలిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. ఆదివారం 7వ రోజున పలు ఉత్సవాల పందిళ్ళలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల ఏడో రోజు కావడంతో పలు ఉత్సవ కమిటీల ప్రతినిధులు స్వామివార్ల నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం నుంచి స్వామివార్ల ఊరేగింపు ప్రారంభించారు. ట్రాక్టర్లు, వివిధ వాహనాలపై స్వామివార్లను ఆశీనులను చేసి ఊరేగింపు కొనసాగించారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శనలు, యువకుల నృత్యాలు, డీజే పాటలతో నగరం దద్దరిల్లింది. ఈ సందర్భంగా బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి వీధిలో స్వామివారి ఊరేగింపు కొనసాగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక నరసింహారావు పేటలో డాక్టర్ జగన్ మోహనరావు వీధిలో ఎన్ఆర్ పేట యూత్ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన ఊరేగింపును స్థానిక కార్పొరేటర్ గూడూరి ప్రసాద్ ప్రారంభించారు. ఊరేగింపు అనంతరం స్థానిక తూర్పు లాకులు, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గంటా ప్రసాదరావుపై విమర్శలు తగవు



లక్కోజు రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావుపై టీడీపీ నాయకుడు అశోక్‌గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం, విమర్శించడం తగదని ఆ పార్టీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఘంటా ప్రసాదరావుపై చేసిన విమర్శలను ఖండించారు. ఇటీవల దెందులూరులో నిర్వహించిన టీడీపీ దీక్షా శిబిరం వద్ద ఆ పార్టీ నాయకుడు చలమోలు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ తమ నాయకుడికి సంఘీభావం తెలియజేయడం మానేసి తోటి బీసీ నాయకుడిపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. కేవలం ఈర్ష్యతో సందర్భం, ఏ ఆధారాలు లేకుండా పసాదరావుపై విమర్శలు చేయడం జరిగిందన్నారు. దిగజారుడు విమర్శలు ఎంత వరకూ కరెక్టో అశోక్ గౌడ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

పెదవేగి : మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం రామసింగవరంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. భారత పార్లమెంటులో ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. దేశ అభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మెట్లపల్లి సూరిబాబు, వెన్నవల్లి రవి, మహేంద్ర దళిత నాయకులు పెరికే వరప్రసాద్, పొలిమేర హరికృష్ణ, యర్రా నాగమల్లేశ్వరరావు, కూచింపూడి ఎంపీటీసీ కాలి చిన్నబుజ్జి, తేరా ఆనంద్, పెరికే ప్రసాద్, బాబు జగజీవన్ రామ్ కమిటీ సభ్యులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరించిన ఎమ్మెల్యే

పెదవేగి : నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు ప్రశంసించారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై కనకరావు ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం కనకరావును ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు.

ప్రజలకు మేలైన సేవలు అందించాలి



లయన్స్ గ్లోబల్ యాక్షన్ టీమ్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలకు మేలైన సేవలు అందించడానికి లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ లయన్స్ సంఘాల అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా లయన్స్ భవనంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ యాక్షన్ టీమ్ వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలోని 65 లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు, సంఘాల నిర్వహణ తీరుతెన్నులపై ఆయన శిక్షణ ఇచ్చారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులుగా ఉంటూ తమ ప్రాంతంలో సమాజానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి నిపుణులైన నర్సింగ్ స్టాఫ్‌ను అందుబాటులో ఉంచిందని, వారితో లయన్స్ సేవా సంస్థలు కలిసి డయాబెటిస్, ఇతర ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మేలైన సేవలు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యం, వైస్ గవర్నర్ ఎం.వేణుబాబు, ఏరియా లీడర్ వీఎస్‌వీడీ ప్రసాద్, మల్టిపుల్ లీడర్స్ దామెర్ల శ్రీశాంతి, ఏఆర్‌కే చౌదరి, కె.పద్మావతి, మాదిరెడ్డి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ఎస్సీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. ఆయన దెందులూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ అతిధి గృహంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల కోసం అభద్రత భావంతో 40 ఏళ్ళ ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిణామాలు ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. నిజం నిలకడ మీద తెలుస్తుందని, దాన్ని కాలమే నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో ఇండియన్ దళిత జేఏసీ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్, ఎస్సీ జాతీయ నాయకులు పొలిమేర హరికృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు యర్రా నాగమల్లేశ్వరరావు, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కొరటాల జీవితం ఆదర్శనీయం



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): సీపీఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, కార్మిక, కర్షక నేత కొరటాల సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. స్థానిక పవర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కొరటాల శత జయంతి సభ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ రెండు సార్లు ఎమ్మెల్యేగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పలు ఉన్నత బాధ్యతలు నిర్వర్తించినా సాధారణ కార్యకర్తలు, ప్రజలతో సైతం కలిసిపోయేవారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కొరటాల యువత సమస్యలు, మనోభావాలను అర్థం చేసుకుని వారిని నడిపించేందుకు విశేష కృషి సాగించారన్నారు. సభలో డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బి.సోమయ్య, పలువురు

నేరాల్లో జోక్యం చేసుకోవద్దు

ఏలూరు టూటౌన్ ఎస్సై శుభశేఖర్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శుభశేఖర్

ఏలూరు టౌన్: ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ ఎస్సై శుభశేఖర్ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒక్కొక్కరితో మాట్లాడుతూ వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గతంలో ఏదైనా కేసుల్లో ఉంటూ రౌడీషీట్ ఓపెన్ చేస్తే.. మీరు ఇప్పుడు మంచి ప్రవర్తనలో ఉంటూ మీ కుటుంబ పోషణకు ఏదైనా పనిచేసుకుంటూ ఇతరులకు ఇబ్బందులు లేకుండా జీవించాలని హితవు పలికారు. మంచి మార్గంలో ఉంటే మీపై రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. నేరాలు, ప్రైవేటు సెటిల్మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఇద్దరు వ్యక్తులపై దాడులు

ఏలూరు టౌన్: అల్లరి మూకలు వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతూ వాహనదారులపై దాడులకు తెగబడ్డారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడేలు రోడ్డులో వినాయక విగ్రహం ఊరేగింపు జరుగుతుండగా ఆ ఊరేగింపులో పాల్గొన్న యువకులు గంజాయి, మద్యం తాగారని చెప్తున్నారు. డాన్సులు చేస్తూ మోటారు సైకిళ్ళపై చక్కెరలు కొడుతూ వాహనాలు వెళ్ళడానికి దారి ఇవ్వకుండా అడ్డగిస్తున్నారనీ బాధితులు వాపోయారు. ఏలూరు రూరల్ మండలం తిమ్మారావుగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ ఆరేపల్లి శ్రీనివాస్ తన ఆటోతో చాటపర్రు నుంచి ఏలూరు వస్తుండగా కోడేలు రోడ్డు వద్ద ఊరేగింపులో ఉన్న బెనర్జీ పేటకు చెందిన పండు, గుండు కనకారావులు ఆటో డ్రైవర్‌ను బయటకు లాగి అతనిపై దాడి చేసి గాయపర్చారు. ఏలూరు వినాయక నగర్‌కు చెందిన మహ్మద్ రెహమాన్ ప్రస్తుతం, ఎస్ఐ పోస్టు మెయిన్ పరీక్ష కోసం చదువుకుంటున్నాడు. తన ఇంటికి మోటారు సైకిల్పై వెళ్తుండగా నక్కలరోడ్డులో అదే ఊరేగింపు అక్కడకు వచ్చింది. ఎంత సేపటికి రోడ్డుపై వాహనాలకు దారి ఇవ్వకపోవడంతో రెహమాన్ హార్న్ కొట్టాడు. దీంతో బెనర్జీ పేటనకు చెందిన పండు, గంగ, మరో 15 మంది రెహమాన్పై దాడి చేసి తలపగులగొట్టారు. అతని మోటారు సైకిల్‌ను ధ్వంసం చేశారు. అతని వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ రెండు సంఘటనలపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చేపట్టారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	120
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	50	ములక్కాడలు	04-06
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	24-28	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	120-220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	06
దోసకాయలు	26-30	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48
		నిమ్మకాయలు (డజను)	--